సాక్షి
ఒడిశా

శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,12,146లు, బంగారం 1 గ్రాముల 750 మిల్లీగ్రాములు, వెండి 10 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పోటెత్తిన భక్తులు

గుప్తేశ్వర్‌కు భక్తులు పోటెత్తారు. శివరాత్రి జాగారం చేశారు. - 8లో▸



స్వచ్ఛంద సేవ

శివరాత్రి అనంతరం లింగరాజ మందిరంలో యువకులు స్వచ్ఛంద సేవ చేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. - 8లో▸

అపురూపం..
మహాదీప దర్శనం



మహా దీప దర్శనం చేసుకున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో పలువురు ప్రముఖులు



లింగ రాజు దేవస్థానంలో మహా దీప దర్శనం

రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శివాలయాల శిఖరాలపై ఆకాశ దీపం దర్శనం కోసం భక్తులు ఎగబడ్డారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి అంతా ఓం నమః శివాయ మంత్రోచ్ఛరణతో జపించిన భక్తులకు గురువారం తెల్లవారుజామున వివిధ దేవాలయాలలోని శివుని మందిరాలపై మహా దీప దర్శనం లభించింది. స్థానిక లింగరాజు దేవస్థానం ప్రాంగణం జాగర ఉత్సవంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా పాల్గొని మహా దీపం దర్శనం చేసుకున్నారు. ఈ ప్రాంగణంలో భక్తులకు బుధవారం రాత్రి సుమారు 10.40 గంటల ప్రాంతంలో మహా దీప దర్శనం లభించింది. పూరీ లోక్‌నాథ్ ఆలయంలో గురువారం వేకువజాము 3 గంటల ప్రాంతంలో, కటక్ ప్రసిద్ధ ధవళేశ్వర్ ఆలయం, ఢెంకనాల్ కపిలాష్ ఆలయంలో ఉదయం 4.30 గంటలకు, భద్రక్ జిలా ప్రసిద్ధ శైవ క్షేత్రం అఖండలమణి ఆలయంలో గురువారం ఉదయం 4.35 గంటలకు మహా దీప దర్శనం చేసుకున్నారు. శ్లోకాలు, మంత్రోచ్ఛరణలు, వాద్య నాదాల మధ్య ఆయా ప్రాంగణాలు భక్తిమయమయ్యాయి. పవిత్ర దీపాన్ని వీక్షించడానికి భక్తులు అర్ధరాత్రి నుంచి ఆలయం వద్ద గుమిగూడారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణాలు రద్దీగా మారాయి. ఈ సందర్భంగా ఆలయ పాలన యంత్రాంగం భద్రత, వైద్య సౌకర్యాలతో సహా విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. – భువనేశ్వర్

న్యూస్‌రీల్

బోల్తాపడిన ట్యాంకర్



రోడ్డుకు అడ్డంగా పడిన ట్యాంకర్

రాయగడ: రాయగడ నుంచి కొరాపుట్ వెళ్లే ప్రధాన రహదారి గుమ్మ ఘాటీరోడ్డు మలుపులో గురువారం తెల్లవారుజామున ఒక ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడింది. టికిరిలోని అల్యూమిన కర్మాగారం నుంచి అల్యూమిన పౌడర్‌ను తీసుకెళ్తున్న సమయంలో గుమ్మఘాటి మలుపులో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కొరాపుట్‌తో సహా టికిరి, కాశీపూర్, లక్ష్మీపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా బుధవారం కూడా ఇదే మలుపు వద్ద లారీ బోల్తాపడి సుమారు 8 గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. తరచూ ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ



శివప్రసాద్ పట్నాయక్

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ బీడీవోగా శివ ప్రసాద్ పట్నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఆయన పద్మపూర్ బీడీవోగా విధులు నిర్వహిస్తుండేవారు. బిసంకటక్ బీడీవోగా పనిచేసిన సదాశివ నాయక్ కలహండి జిల్లాలోని ధర్మఘడ్ బీడీవోగా బదిలీ అయ్యారు. శివప్రసాద్‌కు ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికారు.

శివ భక్తులపై తేనె టీగల దాడి


- 40 మందికి తీవ్రగాయాలు



ప్రాథమిక చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి కమతా గ్రామ శివాలయంలో బుధవారం సాయంత్రం ఆవాంఛనీయ సంఘటన జరిగింది. వందలాది మంది భక్తులు శివాలయంలో పూజలు చేస్తున్న సమయంలో తేనెటీగలు వారిపై దాడి చేశాయి. 40 మందికి పైగా భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని కుమిలి ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం డిశ్చార్జి చేసినట్లు సమాచారం. శివాలయ సమీపంలోని చెట్టుకు ఉన్న తేనెపట్టులో ఉన్న తేనెటీగలు చెదిరి అవి భక్తులపై దాడి జరిపినట్లు స్థానికులు తెలిపారు.

రూ.4 కోట్ల గంజాయి స్వాధీనం



ముంబాయికి తరలిస్తున్న గంజాయి సంచులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్ అడవ నుంచి ముంబైకి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మూడు రోజుల తర్వాత కాశీనగర్ బ్లాక్ రాణిపేట వద్ద గురువారం అబ్కారీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మ్యాక్స్‌పికప్ వ్యాను డ్రైవర్, అడవ పీఎస్ పరిధి బురుగుల గ్రామ వాసి కురా దండసేన (39)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..
ముంబై మెట్రోకు గజపతి జిల్లా అడవ నుంచి వయా గుణుపురం, కాశీనగర్ మీదుగా పలాస రైల్వే స్టేషన్ పార్శిల్ ద్వారా రవాణా అవుతున్నట్టు అబ్కారీశాఖ సూపరింటెండెంటు ప్రదీప్ సాహు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఒక మ్యాక్స్ పికప్ వ్యానులో రవాణా చేస్తూ పట్టుబడిన గంజాయి 8 పార్శిల్ ప్యాకెట్లలో 384 కిలోల గంజాయి ఉన్నట్టు అబ్కారీ సూపరింటెండెంట్ సాహు తెలియజేశారు. బట్టల పార్శిల్ లాగా ఎవరికీ అనుమానం రాకుండా రైల్వే బుకింగ్ పార్శిల్ ద్వారా గుట్టుగా గంజాయి రవాణా చేస్తున్నట్టు అబ్కారీ శాఖ అధికారులకు తెలిసింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు నాలుగు కోట్ల రూపాయలు ఉంటుందని అబ్కారీ సూపరింటెండెంటు ప్రదీప్ సాహు తెలియజేశారు. వ్యాన్ డ్రైవరు కురా దండసేనను కోర్టులో గురువారం హాజరుపరిచారు. కేసును విచారిస్తున్నట్టు అబ్కారీ శాఖ అధికారి తెలియజేశారు.

పోలవరంపై పోరాటం చేస్తాం

- శాసన సభాపక్ష నాయకుడు రామచంద్ర ఖడం

కొరాపుట్: పోలవరం ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటానికి దిగుతుందని ఆ పార్టీ శాసన సభాపక్ష నాయకుడు రామచంద్ర ఖడం ప్రకటించారు. గురువారం తన సొంత నియోజకవర్గం కొరాపుట్ జిల్లా పొట్టంగిలో మీడియాతో మాట్లాడారు. ఇది చాలా పెద్ద సమస్య అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు పెంచడం వలన మల్కనగిరి జిల్లా మెట్టు ప్రాంతంలో అనేక గ్రామాలు నీట మునుగుతాయన్నారు. వేలాది గిరిజనులు నిరాశ్రయులవుతారన్నారు. ఈ సమస్యపై సమగ్ర సర్వే చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో బీజేపీది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదని, ఆంధ్రతో కలిపి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఉండడం వలన ఇలా తప్పుడు నిర్ణయాలు జరుగుతున్నాయన్నారు. అక్కడ నిర్వాసితులు మారనున్న గిరిజనులకు సహాయం చేయకుండా పోలవరం ముందుకు సాగితే తాము రోడ్ల పైకి వచ్చి ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి కేంద్రంలో దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు.



దివ్యాంగునికి ట్రై సైకిల్ అందించిన రామచంద్ర ఖడం

పరీక్షల సమయంలో ప్రసవం

భువనేశ్వర్: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ప్రాంతంలో బాలిక ప్రసవం సంచలనం కొలిక్కి రాకముందే జాజ్‌పూర్ జిల్లాలో ఇలాంటిదే మరో సంఘటన వెలుగు చూసింది. పదో తరగతి పరీక్షలు రాయాల్సిన బాలిక శిశువును ప్రసవించింది. జాజ్‌పూర్ జిల్లా బొరీ మండలానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని స్థానిక ఆస్పత్రిలో ఆడ పిల్లకు జన్మనిచ్చింది. ఈమె రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు బీఎస్ఈ నిర్వహిస్తున్న మెట్రిక్యులేషన్ పరీక్షలు రాస్తోంది. తొలి రెండు పరీక్షలు విజయవంతంగా రాయగలిగింది. బుధవారం పరీక్ష రాసిన తర్వాత తెలియని ప్రసవ వేదనకు గురైంది. అనారోగ్యంగా భావించి బెంబేలెత్తిన తల్లిదండ్రులు బాలికని బొరి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో ప్రసవించింది. దీంతో అంతా అవాక్కయ్యారు. తర్వాత ఉన్నత చికిత్స కోసం జాజ్‌పూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స కొనసాగుతోంది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం. ఈ పరిస్థితుల్లో గురువారం రాయాల్సిన గణితం పరీక్షకు బాలిక హాజరు కాలేకపోయింది. ఈ సంఘటనపై అనుబంధ వర్గాలు విచారణకు రంగంలోకి దిగాయి. బాలిక గర్భిణి అన్న విషయం తెలియదని తల్లిదండ్రులు తెలిపారు. రాష్ట్ర పోలీసు, శిశు సంక్షేమ శాఖ వర్గాలు విచారణ కొనసాగిస్తున్నాయి.

ఖుర్దారోడ్‌లో మహా శివరాత్రి పూజలు



బాలాజీ మందిరం సముదాయంలో లింగోద్భవ కాల అభిషేకం

భువనేశ్వర్: మహా శివరాత్రి పర్వ దినం పురస్కరించుకుని ఖుర్దారోడ్ ప్రాంతంలో ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. శివాలయాలతో ప్రధాన ఆలయ సముదాయాల్లో ప్రత్యేక అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం నుంచి గురువారం వేకువ జాము వరకు ఈ కార్యక్రమాలు నిరవధికంగా కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. స్థానిక ట్రాఫిక్ కాలనీ రామ మందిరంలో ధనంజయ ఆచార్యులు, అకౌంట్సు కాలనీ బాలాజీ మందిర సముదయంలో సంతోష్ కుమార్ శర్మ మహా శివ రాత్రి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల, మధ్యాహ్న, ప్రదోషకాల, లింగోద్భవ కాల అభిషేకాలు, సాలగ్రామ సూత్ర ధారాభిషేకం, అన్నాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



పార్థివేశ్వరునికి అన్నాభిషేకం

కాళరాత్రిగా మారిన శివరాత్రి



నాలాలో బైక్



గంగాధర్ గెమల్

కొరాపుట్: మహాశివ రాత్రి జాగారం ఆ యువకుల పాలిట కాళరాత్రిగా మారింది. గురువారం ఉదయం 6 గంటల సమయంలో కొరాపుట్ జిల్లా పాడువా పోలీస్ స్టేషన్ పరిధిలోని చటువ పంచాయతీ సమీపంలో జయపూర్–విశాఖ పట్నం జాతీయ రహదారిపై ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్న బైక్ 20 అడుగుల లోతులో ఉన్న దురువ వంతెన వద్ద నాలాలో పడిపోయింది. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితికి చెందిన పూర్ణ చంద్ర ఖొర (30), గంగాధర్ గెమల్ (31)కి యువకులు శివరాత్రి కోసం వెళ్లి వస్తుండగా నిద్రమత్తులో బండి అదుపు తప్పి పడిపోయింది. ఉదయం ఈ మార్గం గుండా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక గిరిజనులు కిందకు దిగి పరిశీలించగా వారిలో ఒక యువకుడు కొన ఊపిరితో కనిపించాడు. అతడిని నందపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకి తరలించారు. ఇద్దరు యువకులూ తర్వాత కన్నుమూసినట్లు తెలిసింది.



సంఘటన స్థలం వద్ద స్థానికులు



పూర్ణ చంద్ర ఖొర

లింగరాజ్ ఆలయం శివరాత్రి ఉత్సవాల్లో అపశృతి



ఆలయ శిఖరం నుంచి కిందకి జారిపడిన సేవాయత్

భువనేశ్వర్: పవిత్ర మహా శివరాత్రి నాడు లింగరాజ్ ఆలయం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. అయితే ఆలయ శిఖరంపై మహా దీపం దర్శనం సన్నాహకాల్లో భాగంగా దివిటీతో ఆలయ శిఖరం పైకి వెళ్తున్న సేవాయత్ ప్రమాదవశాత్తు జారి కిందకు పడ్డాడు. బాధిత సేవాయత్‌ను యోగేంద్రగా గుర్తించారు. అతడు తీవ్రంగా గాయపడ్డాడు. సత్వర చికిత్స కోసం హుటాహుటిన స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

దీప దర్శనం ఆలస్యం

మహా శివ రాత్రి సందర్భంగా లింగరాజు ఆలయం శిఖరాన మహా దీప దర్శనం కోసం తండోపతండాలుగా భక్తులు తరలి వచ్చారు. ముందస్తు ప్రకటన ప్రకారం బుధవారం రాత్రి 10 గంటలకు ఈ దర్శనం ఏర్పాట్లు పూర్తి కావాల్సి ఉంది. సన్నాహాల్లో జాప్యంతో మహా దీప దర్శనం సుమారు 40 నిమిషాలు ఆలస్యంగా లభించింది. బుధవారం రాత్రి 10.40 గంటల ప్రాంతంలో లింగరాజ్ ఆలయ శిఖరంపై మహా దీప దర్శనం చేసుకుని భక్తులు తరించారు. ఉపవాసం ఉన్న వేలాది మంది భక్తులు ఆలయ ప్రాంగణం లోపల ఆలయ ఆచారాలకు కట్టుబడి ఓపికగా వేచి ఉండి ఉపవాసం విరమించారు.

ముఖ్యమంత్రి పరామర్శ

ప్రమాదవశాత్తు లింగ రాజు ఆలయ శిఖరం నుంచి ప్రమాదవశాత్తు జారి గాయపడిన సేవాయత్‌ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా పరామర్శించారు. చికిత్స అందజేస్తున్న వైద్య బృందంతో సంప్రదించి సేవాయత్ ఆరోగ్య స్థితిగతుల్ని తెలుసుకున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత సేవాయత్ బాగోగులు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి



గాయపడిన బాధిత సేవాయత్‌ని పరామర్శించిన ముఖ్యమంత్రితో న్యాయ శాఖ మంత్రి

క్లుప్తంగా

ఎక్స్ రే అటెండర్ అనుమానాస్పద మృతి


ప్రభాత్ మహంతి

భువనేశ్వర్: స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి ఎక్స్ రే గదిలో వేలాడిన మృత దేహం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు ఈ ఆస్పత్రి ఎక్స్‌రే విభాగంలో అటెండర్‌గా పనిచేస్తున్న ప్రభాత్ మహంతిగా గుర్తించారు. గత రాత్రి యథాతథంగా విధులకు హాజరై ఇలా అఘాయిత్యానికి పాల్పడడం కలకలం రేపింది. ఈ అఘాయిత్యానికి కారణం విచారణలో తేలుతుందని పోలీసు దర్యాప్తు బృందం తెలిపింది.

ప్రసాదం, మజ్జిగ పంపిణీ


మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేస్తున్న మహిళలు

రాయగడ: స్థానిక న్యూకాలనీలో గల శివమందిరంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు లేడీస్ వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రసాదం, మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూత్ వాకర్స్ క్లబ్ సభ్యులు కూడా పాల్గొని తమ సేవలను అందించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ తరహా సేవా కార్యక్రమాలను ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు తెలియజేశారు.

పరారీలో ఉన్న నిందితుడు అరెస్టు


అరెస్టైన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల పోలీసులు ఒక గంజాయి కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 2024 ఏప్రిల్‌లో మల్కన్‌గిరి పోలీసులు కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న బలిమెల సమితి నీలాద్రీనగర్‌కు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. అయితే అతను అప్పుడు పోలీసులను మోసం చేసి పరారయ్యాడు. దీంతో శివరాత్రి పురస్కరించుకొని అతడు ఇంటికి వచ్చిన సందర్భంగా అరెస్టు చేశారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


లక్ష్మణరావు మృతదేహం

పొందూరు: మండలంలోని ఖాజీపేట గ్రామానికి చెందిన పల్ల లక్ష్మణరావు(45) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మణరావు పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కువగా ఉండటంతో బుధవారం రాత్రి తండ్రి అప్పారావుతో మాట్లాడాడు. అనంతరం బావిలో దూకా డు. వెంటనే గ్రామస్తులు స్పందించి బయటకు తీసినా అప్పటికే మృతి చెందాడు. లక్ష్మణరావు కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

తమ్ముడు కోసం తప్పుడు మార్గం

ఇచ్ఛాపురం: గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన తమ్ముడిని విడిపించేందుకు అన్న కూ డా గంజాయి బాటే పట్టాడు. ఈ క్రమంలో తోటి యువకులతో కలిసి ఇచ్ఛాపురం పోలీసులకు పట్టు బడ్డాడు. ఒడిశా నుంచి కేరళ రాష్ట్రంలోని ఖాయంకూలమ్ ప్రాంతానికి అక్రమంగా గంజాయి తరలిస్తుంగా ఈ ఆరుగురు ముఠా సభ్యులను ఇచ్ఛాపు రం పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపు రం సీఐ కార్యాలయంలో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మోహనబ్లాక్ గోవిందపూర్ గ్రామానికి చెంది న మైఖేల్ సబర్, సుమంతా సబర్, సుఖాంత్ సబ ర్, తాతా గమాంగ, బబులా గమాంగ, చిమిడిపిల్ పంచాయతీ సింగిపూర్ గ్రామానికి చెందిన ప్రకాష్ గమంగలు మోహన బ్లాక్ సమీపంలోని కొండ ప్రాంతం వద్ద 47.480 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. ఆరు ప్యాకెట్లుగా విభజించి 5 లగేజ్ బ్యాగ్, ఒక ట్రావెలింగ్ సూట్‌కేస్‌లో పెట్టి బరంపురం వచ్చారు. అక్కడి నుంచి బుధవారం బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నారు. అనంతరం కేరళ రాష్ట్రం ఖాయంకూలమ్ ప్రాంతానికి తీసుకెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కి వెళ్తుండగా ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు.

తమ్ముడిని విడిపించేందుకు..

నిందితులు గంజాయిని ఒడిశాలో కేజీ రూ.2వేలుకు కొనుగోలు చేసి కేరళలోని దుర్గకు అప్పగిస్తే అతను కేజీకి రూ.8వేలు చొప్పున అప్పగించేవాడు. ఈ క్రమంలో మైఖేల్ సబర్ తమ్ముడు సిమన్ సబర్ జనవరిలో గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని విడిపించడానికి డబ్బులు అవసరం కావడంతో మైఖేల్ కూడా గంజాయి రవాణా చేసేందుకు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, పట్టణ ఎస్సై ముకుందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ

- కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ

జయపురం:

వ్యవసాయంలో పాత పద్ధతలకు తిలోద కాలు ఇచ్చి నూతన పద్ధతులు అమలు చేయాల్సిన అవసరం ఉందని కొరాపుట్ ఎం.ఎల్.ఎ రఘునాథ్ మచ్చ అన్నారు. గురువారం స్థానిక దసరాపాడియలో జిల్లా వ్యవసాయ విభాగం నిర్వహించిన ఐదు రోజుల వ్యవసాయ యంత్ర 2025–2026 మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా అవిభక్త కొరాపుట్, మల్కనగిరి, రాయగడ, నవరంగపూర్ జిల్లాల నుంచి హాజరైన వందలాది మంది రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయమే దేశానికి వెన్నెముక అన్నారు. పాత పద్ధతులతోనే వ్యవసాయం చేస్తే ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుందని, అందుచేత వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను వినియోగించి అధిక ఉత్పత్తి సాధించాలన్నారు. యంత్రాల ద్వారా వ్యవసాయం చేస్తే త్వరగా పనులు జరిగి ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు రక్షించబడతాయన్నారు. నేడు వ్యవసాయ పనులకు కూలీల కొరత ఎక్కువగా ఉందని, అందువలన వ్యవసాయానికి యంత్రాలు వినియోగించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి మోహణ మజిలు రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేసేందకు పలు పథకాలు అమలు చేసున్నారన్నారు. వ్యవసాయ యంత్రాలపై రైతులకు సబ్సిడీలు ప్రకటించారన్నారు. వరి పంట పుట్టినిల్లు అయిన కొరాపుట్ వ్యవసాయ ఉత్పత్తులు దేశ, విదేశాలకు అందిచేదిగా ఉండాలన్నారు. చేపలు, గుడ్లు వంటివి ఆంధ్ర నుంచి వస్తున్నాయని, వాటిని మనం ఎందుకు ఉత్పత్తి చేయలేమని రైతులను ప్రశ్నించారు. ప్రభుత్వం వ్యవసాయం, ఉద్యానవన, పాల ఉత్పత్తి, చేపల పెంపకం చేసే రైతులకు ఎన్నో పథకాల ద్వారా ఆదుకుంటుందన్నారు. ఈ మేళాలో యంత్రాల వినియోగంపై రైతులకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. కొరాపుట్ జిల్లాలో ఉత్తమ రైతులకు సన్మానించి ప్రశంసాపత్రాలు, మెమొంటాలు అందజేశారు. వ్యవసాయంలో అధికోత్పత్తి సాధించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలచిన రైతులకు నగదు బహుమతులు అందజేశారు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, వ్యవసాయానికి సంబంధించిన 100 స్టాల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా ప్రధాన వ్యవసాయ అధికారి గోకుల చంద్ర ప్రధాన్ అధ్యక్షతన జరిగిన వ్యవసాయ యంత్ర మేళాలో గౌరవ అతిథిలుగా జిల్లా పరిషత్ అధ్యక్షురాలు శస్మిత మెలక, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధా బినోద్ సామంతరాయ్, కొరాపుట్ జిల్లా ప్రధాన ఉన్నతాధికారి బేణుధర శబర, జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శౌశ్య రెడ్డి, జిల్లా అదనపు వ్యవసాయ అధికారి లోచన చంద్ర మఝి, జిల్లా మత్స్య విభాగ అధికారి భరత్ భూషణ సాహు, జయపురం సబ్ డివిజన్ పశు వైద్యాధికారి బిశ్వజిత్ రాయ్, వ్యవసాయ కార్య నిర్వాహక ఇంజినీర్ సంతోష్ కుమార్ మిశ్ర హాజరయ్యారు.


మేళాలో పాల్గొన్న నాలుగు జిల్లాల నుంచి వచ్చిన రైతులు


ఇఫ్కోవారి స్ప్రే యంత్రం


రైతు గౌరచరణ గౌరడకు నగదు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ


మినీ కోత యంత్రం


వ్యవసాయ యంత్రాలు


వ్యవసాయ యంత్రాలను పరిశీలిస్తున్న రైతులు


అధునాతన వ్యవసాయ యంత్రం

గుప్తేశ్వర్‌కు పోటెత్తిన భక్తులు


గురువారం గుప్తేశ్వరలో భక్తులు దర్శనమిచ్చిన గుప్తేశ్వర లింగం


గుప్తేశ్వర కొండపై బారులు తీరిన భక్తులు

జయపురం: ప్రసిద్ధ శివ క్షేత్రం గుప్తేశ్వర్‌కు బుధవారం రాత్రి, గురువారం భక్తులు పోటెత్తారు. రాత్రి జాగారం చేసిన వేలాది మంది భక్తుల కోసం భజన కార్యక్రమాలు నిర్వహించారు. గుహలో ఉన్న అపూర్వ శివలింగాన్ని దర్శించుకొనేందుకు కొండపై వరకు గల మెట్లపై భక్తులు క్యూ కట్టారు. జయపురంలోని శివాలయాల్లో రాత్రి ఆదివాసీ నాటకాలు నిర్వహించారు. పూర్ణఘడ్ గల నీలకంఠేశ్వర ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక లేబర్ కాలనీ కూడలి వద్ద గల శివాలయం రంగురంగుల దీపాలతో భక్తులు అలరించింది.

ఆ నలుగురికి సత్కారం


జనరల్ మేనేజరు సత్కారం అందుకున్న సిబ్బంది.

భువనేశ్వర్: విధి నిర్వహణలో అసాధారణ దక్షత, అప్రమత్తతతో కూడిన సమయ స్ఫూర్తితో వ్యవహరించిన నలుగురు రైల్వే ఉద్యోగులను తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ ప్రత్యేకంగా సత్కరించారు. స్థానిక జోనల్ ప్రధాన కార్యాలయంలో నిరాడంబరంగా నిర్వహించిన సిబ్బంది సత్కార కార్యక్రమానికి అదనపు జనరల్ మేనేజర్, ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్‌తో సహా సీనియర్ అధికారులు హాజరయ్యారు. కొరాపుట్ స్టేషన్‌లోని సీనియర్ అసిస్టెంట్ లోకో పైలట్ ముఖ్‌రాజ్ మీనా, చిమిడిపల్లి స్టేషన్ 10వ నంబరు గ్యాంగ్ ట్రాక్ మెయింటెయినర్ సింగంపల్లి వెంకట్ కృష్ణ, అరంద్ స్టేషన్ లోని ట్రాఫిక్ పాయింట్స్‌మెన్ రమేష్ మహానంద్, సింహాచలం స్టేషన్‌లోని సీనియర్ గూడ్స్ రైలు మేనేజర్ చలుమూరి రమణ నాయుడును జనరల్ మేనేజర్ సన్మానించారు. ప్రయాణీకుల భద్రత, సమర్థవంతమైన రైలు కార్యకలాపాలను నిర్ధారించడంలో ప్రతి రైల్వే సిబ్బంది అంకితభావం కీలక పాత్ర పోషిస్తుందని జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ ప్రశంసించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి


జిల్లా కలెక్టర్ బిజయ్‌కుమార్ దాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఓయూజే సభ్యులు

పర్లాకిమిడి: ఒడిశా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని పర్లాకిమిడి ఓ.యు.జె ప్రింట్, ఎలక్ట్రానిక్ విలేకరులు కలిసి ముఖ్యమంత్రి మోహన్ మఝికి రాసిన వినతిని కలెక్టర్ బిజయ్‌కుమార్ దాస్‌కు గురువారం అందజేశారు. 60 ఏళ్లు దాటిన వర్కింగ్ జర్నలిస్టులకు నెలసరి పెన్షన్ రూ.25 వేలు మంజూరు, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు కల్పించేలా జర్నలిస్టుల భద్రతా చట్టం అమలు, జర్నలిస్టులు అక్రిడిషేన్ కార్డుల మంజూరుకు కమిటీ ఏర్పాటు చేయాలని ఓ.యు.జె (ఒడిశా జర్నలిస్టుల సంఘం) కోరింది. ఒడిశాలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి జర్నలిస్టుల సమస్యలు తీసుకువెళ్లాలన్న ఉద్దేశంతో కలెక్టర్ ద్వారా వినతిని అందజేశామని ఓ.యు.జె. అధ్యక్షుడు బసంత పండా అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రెస్‌క్లబ్ సాధారణ కార్యదర్శి ఆదర్శ దాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రూపేష్ సాహు, తదితరులు ఉన్నారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం


పర్లాకిమిడిలో శివపార్వతుల విగ్రహాలను తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం


సీతాసాగరంలో మల్లికార్జున స్వామి విగ్రహం ఊరేగింపు

పర్లాకిమిడి: పట్టణంలో మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం రాత్రి లింగాభరణం, శివపార్వతుల కల్యాణాన్ని రామలింగేశ్వర ఆలయం, శ్రీమల్లికార్జున స్వామి, ఏకాంబరీశ్వర ఆలయంలో ఘనంగా జరిపించారు. గురువారం ఉదయం శివపార్వతుల ఉత్సవ మూర్తులను తిరువీధి ఉత్సవం జరిపించారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులను దర్శించుకుని హారతులిచ్చారు. ఈ ఉత్సవంలో పోడుగు కోవెల ప్రధాన పూజారి దుర్గాప్రసాద్ దాస్, ఆలయ ట్రస్టు దాకోజు పాల్గొన్నారు.

దంపతులను ఢీకొట్టిన అంబులెన్స్


సూర్యారావు (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా.. భార్య తీవ్ర గాయాలపాలైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నగరంలోని మధునగర్‌లో నివాసముంటున్న కుందు సూర్యారావు (56), సావిత్రి దంపతులు గురువారం ఉదయం విజయనగరం జిల్లా రామతీర్థాలు పుణ్యక్షేత్రానికి వెళ్లారు. దర్శనం పూర్తి చేసుకొని బైక్‌పై తిరిగి వస్తుండగా ఎచ్చెర్ల బైపాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి అంబులెన్స్ ఢీకొట్టింది. హైదరాబాద్ నుంచి పశ్చిమబెంగాళ్ వెళ్తున్న అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూర్యారావు మృతిచెందగా.. భార్య ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఎస్సై వి.సందీప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రిమ్స్ లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ తీరు బాధాకరం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: రాష్ట్రంలో చట్టసభల ప్రతిష్టను దిగజార్చేలా సభల నిర్వహణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం ఎంత వరకు భావ్యమని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రశ్నించారు. గురువారం కొత్తపుట్టుగ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జె ట్ సమావేశాలలో భాగంగా తొలిరోజు రాష్ట్ర గవర్న ర్ ప్రసంగ నివేదికను సిద్ధం చేసిన ప్రభుత్వ యంత్రాంగం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగం నివేదికలో ప్రభుత్వం పొందుపరిచిన అంశాలు అర్ధసత్యంగా ఉన్నాయన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ కేటాయింపుల విషయంలోగానీ, నివేదికలో ప్రస్తావించిన అంశంలో గానీ పారదర్శకతకు పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాను వైఎస్సార్ సీపీ అధినే త వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రకటించకపోవడం ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తారనే అభద్రతాభావ మే కారణమన్నారు. ప్రజల గొంతుకలా నిలిచే ప్రతిపక్ష పాత్రను నిర్వీర్యం చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వ పాలన తీరును ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికై నా ప్రజాస్వామ్య విలువల్ని గుర్తించాలని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పొందూరు: మండలంలోని రాపాక కూడలి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొంచాడ గ్రామానికి చెందిన పల్ల రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. సాయంత్రం రోడ్డు పక్కన రాములు నిల్చొని ఉండగా ట్రాక్టర్ దూసుకొచ్చింది. తప్పించుకునే ప్రయత్నంలో ట్రాక్టర్ టైరు రాము కాలు పైనుంచి వెళ్లింది. దీంతో కాలు నుజ్జునుజ్జయ్యింది. గాయపడిన రాములును కుటుంబసభ్యులు చికిత్స కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. రాములు భార్య సూరీడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలపై ఆరా


పర్లాకిమిడి రైల్వే స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు


డిస్‌ప్లే బోర్డును పరిశీలిస్తున్న రైల్వే ఇంజినీర్లు, దివ్యాంగుల కమిటీ సభ్యులు

పర్లాకిమిడి: స్థానిక రైల్వే స్టేషన్‌లో దివ్యాంగుల సౌకర్యాల కోసం ఈస్టు కోస్టు, వాల్తేరు డివిజన్ ఇంజినీర్లు, సమర్థ్ దివ్యాంగుల పునరావాస కేంద్రం అధ్యక్షుడు సంతోష్ మహరాణా ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేపట్టారు. పర్లాకిమిడిలో రైల్వే స్టేషన్ అమృత్ భారత్ వికాస్‌లో భాగంగా అప్‌గ్రేడ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజన్ మేనేజర్ ఎస్వీ రమణ, అసిస్టెంట్ ఇంజినీరు (శ్రీకాకుళం) బి.వి.ఎస్.మూర్తి, జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ సభ్యుడు సంతోష్ కుమార్ మహారాణా, రాష్ట్ర దివ్యాంగుల పునరావాస కేంద్రం అధ్యక్షుడు నిరంజన్ బెహరా, సమర్థ్ సంస్థ కార్యదర్శి ఎ.జగన్నాథ రాజు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్‌లో వీల్‌చైర్స్, ర్యాంప్‌లు, త్రిచక్ర వాహనాలు, బ్రెయిలీ సైన్ బోర్డులు, డిస్‌ప్లే బోర్డులు, వినికిడి యంత్రాల బోర్డులు తదితర సౌకర్యాలను పర్యవేక్షించారు. రైల్వే స్టేషన్లలో నిర్మాణంలో ఉన్న ర్యాంపులు, సైన్ బోర్డులు, రెస్ట్‌రూమ్‌లను పరిశీలించారు.

స్వచ్ఛంద సేవ


జాగర దీప జపం ప్రాంగణంలో పరిశుభ్రత చర్యలు

మహా శివ రాత్రి జాగరణ దర్శనం పురస్కరించుకుని భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక లింగ రాజు దేవస్థానం పరిసరాల్లో దీపం ప్రమిదలు వంటి పూజ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ చెత్తా చెదారం తొలగించేందుకు స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం సరికి పలువురు యువతీయువకులు స్వచ్ఛందంగా రంగంలోకి దిగారు. పర్యావరణ పరిరక్షణలో వీరి కృషి సర్వత్రా ప్రశంసలు అందుకుంది.

భువనేశ్వర్


దర్శనం క్యూ కాంప్లెక్సు పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ


లింగరాజు ఆలయం వీధుల్లో వ్యర్థాల తొలగింపు


బిందు సాగర్ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ చర్యలు

క్లుప్తంగా

పోలమాంబ ఐదో జాతర ఆదాయం రూ.5లక్షలు



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఐదో జాతర ఆదాయం ఈఓ వీవీ సూర్యనారాయణ సమక్షంలో గురువారం లెక్కించారు. శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,78,600లు, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.61,320లు, కేశ ఖండన టికెట్ల ద్వారా రూ.5,480లు, మహా అన్నదాన విరాళాల ద్వారా రూ.97,086, లడ్డు ప్రసాదం ద్వారా రూ.1,08,840 రూపాయలు, పులిహోర ప్రసాదం ద్వారా రూ.64,770 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఐదో జాతరలో మొత్తంగా 5,16,096 రూపాయలు ఆదాయం సమకూరింది. లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్ద లు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల పరుగు పోటీలు



ఉల్లాసంగా పరుగు తీస్తున్న ఎడ్లు బండి

లక్కవరపుకోట: మండలంలోని లచ్చంపేట గ్రామంలో గురువారం నిర్వహించిన అంతర్ జిల్లాల ఎడ్ల పరుగు పందెం పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామంలో గల శ్రీ వీరమాంబ సహిత గిరినాగేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకొని గ్రామస్తులు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 8 జతల ఎడ్లు బళ్లు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతిలను అందజేశారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు భద్రత, భరోసా పెరుగుతుంది. అందుకు గురువారం జరిగిన సంఘటనే ఉదాహరణ. విశాఖపట్నం నుంచి విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కి ఆర్టీసీ బస్సులో వచ్చిన అప్పలసూర్యనారాయణ అనే ప్రయాణికుడు రూ.17,500 నగదును బస్సు సీట్లో వదిలేసి వెళ్లిపోయారు. సంబంధిత బస్సు కండక్టర్ పీఎస్ఎం రాజు దీన్ని గుర్తించి సీట్లోని నగదును తీసుకొని కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది సత్యంకు అందజేశారు. తిరిగి వచ్చిన ప్రయాణికుడికి ఆయన వదిలేసిన నగదును డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు సమక్షంలో అందజేశారు. కండక్టర్ నిజాయితీని ఆర్టీసీ అధికారులు అభినందించారు.

సురక్షితంగా గిరిజన చిన్నారులు : డీఎంహెచ్ఓ

విజయనగరం ఫోర్ట్: ఎస్.కోట మండలంలోని గిరిశిఖర గ్రామాలైన రాయపాలేం, గూనపాడు, శనగపాడు కురిడి గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న చిన్నారులకు ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నామని, అందరూ సురక్షితంగా ఉన్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చికిత్స అనంతరం కోలుకున్న ఇద్దరిని డిశ్చార్జ్ చేసినట్టు పేర్కొన్నారు. మిగిలిన పిల్లలకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందజేస్తున్నామని తెలిపారు. అస్వస్థతకు గురైన 4 గ్రామాల్లో ఇప్పటికే యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్పేస్ స్ప్రేను జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో చేయనున్నట్టు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు రేపు

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి వద్ద ఉన్న తాండ్రపాపారాయ పాలిటెక్నికల్ కళాశాలలో మార్చి ఒకటో తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ తూముల భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఇసుజు కంపెనీ చేపడుతున్న ఈ ఇంటర్వ్యూలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ చదువుకున్న వారంతా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు.

● రడీమేడ్ వైపు ప్రజల దృష్టి ● వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'జగనన్న చేదోడు'తో భరోసా
● ఆదుకోని కూటమి ప్రభుత్వం ● నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం

దర్జా కోల్పోయిన దర్జీలు



రాజాం సిటీ: సమాజంలో హుందాగా కనిపించాలంటే దుస్తులే ప్రధానం. పండగలు, శుభకార్యాలు, చిన్నచిన్న కార్యక్రమాలు ఏవైనా సరే టైలర్లకు చేతి నిండా పని ఉండేది. కొత్త దుస్తులు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూ కట్టేవారు. గతంలో వీరి పరిస్థితి దర్జాగా ఉండేది. అటువంటిది కాలక్రమంలో మార్కెట్‌లోకి పలు ఫ్యాషన్లు, డిజైన్లతో కూడిన రడీమేడ్ వస్త్రాలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం టైలర్లకు ఉపాధి కరువైంది. గతంలో దర్జాగా బతికే వారి జీవితాల్లో దర్జా లేకుండా పోవడమే కాకుండా కులవృత్తినే నమ్ముకున్న వారి పరిస్థితి నానాటికీ దయనీయంగా మారుతోంది. నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఫ్యాషన్ వైపు పరుగులు

టైలర్ వృత్తి రోజురోజుకీ అనేక మార్పులకు గురౌతు వచ్చింది. ఇప్పుడు ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా మారిపోవడంతో పాత కుట్టుమిషన్ల స్థానంలో అత్యాధునిక మిషన్లు వచ్చాయి. కంప్యూటర్లు ప్రవేశంతో ఎలాంటి డిజైన్ అయినా అలవొకగా తీర్చిదిద్దే విజ్ఞానం అందుబాటులోకి వచ్చేసింది. నేటి యువతతో పాటు మధ్య వయసు వారు సైతం ఎక్కువగా టీ షర్టులు, జీన్స్ ప్యాంట్లు ధరిస్తున్నారు. షాపింగ్ మాల్స్‌లో అయితే ఆఫర్ల పేరుతో వల వేస్తుండడంతో ప్యాంట్లు, షర్టులు సైతం రడీమేడ్ కొనుగోలు చేస్తున్నారు. అతి కొద్ది మంది మాత్రమే టైలర్ల వద్ద దుస్తులు కుట్టించుకుంటున్నారు. దీంతో టైలర్లకు పెద్దగా పనిలేని పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు పండుగల సమయంలో ఇంటిల్లపాది కొత్త దుస్తులు కోసం క్లాత్‌లు తెచ్చుకుని టైలర్ల వద్ద కుట్టించుకునేవారు. దీంతో తినడానికి సమయం లేని స్థితి నుంచి నేడు దయనీయ స్థితికి టైలర్లు చేరుకున్నారు.

నాడు జగనన్న చేదోడుతో బాసట

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం 'జగనన్న చేదోడు' పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి టైలర్‌కు ఏటా రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది. టైలర్లకు ఈ పథకం కొంతమేర వెసులుబాటు కల్పించింది. ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం క్లాత్‌ను ప్రభుత్వం అందించి కుట్టు కూలి డబ్బులను తల్లుల ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. యూనిఫాం ప్రభుత్వం కుట్టించి ఇవ్వకుండా క్లాత్ మాత్రమే ఇవ్వడంతో టైలర్లకు వారికి పని కల్పించడంతో పాటు మేలు జరిగింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం టైలర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. కనీసం గతంలో మాదిరిగా విద్యార్థులకు క్లాత్ ఇస్తే కొంతవరకైనా తమకు ఉపాధి లభిస్తుందని టైలర్లు అభిప్రాయపడుతున్నారు.

వెలవెలబోతున్న టైలరింగ్ షాపులు

గ్రామ స్థాయి నుంచి పట్టణం వరకు ప్రతి చోటా టైలర్లు ఉన్నారు. షాపుల ద్వారా కొందరు... ఇళ్లల్లోనే మరికొందరు వస్త్రాలు కుడుతున్నారు. నియోజకవర్గంలో సుమారుగా 350 మంది వరకు దర్జీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చేస్తుండడంతో వస్త్రం తీసుకుని టైలర్ల వద్ద కుట్టించుకునేవారు తగ్గిపోయారు. దుస్తులు కుట్టించుకునేందుకు ఎవరు వస్తారా.. అని టైలర్లు ఎదురు చూసే పరిస్థితులు వచ్చాయి. ఇదిలా ఉంటే కుటుంబ పోషణతో పాటు షాపుల అద్దెలు చెల్లించేంత సంపాదన లేక దీన స్థితిలో బతుకీడుస్తున్నారు.

పనులు లేకుండా పోయాయి



రడీమేడ్ వస్త్రాల రాకతో మాకు పనులు లేకుండా పోయాయి. పండుగల సమయంలో కూడా పనులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇంతకు ముందు పండుగల సమయంలో రాత్రి పగలు పనిచేసే వాళ్లం. భవిష్యత్తులో ఈ వృత్తిలో కొనసాగడం కష్టతరంగా మారుతుంది. ఈ వృత్తిని కొనసాగించేందుకు కూడా యువత ఆసక్తి చూపడం లేదు.

– కె.సత్యం, టైలర్, వస్త్రపురి కాలనీ, రాజాం

టైలరింగ్‌పైనే ఆధారం



టైలరింగ్ పనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. పనులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చాలా మంది రడీమేడ్ దుస్తులు వాడడంతో కుట్టించుకునేవారి సంఖ్య తగ్గిపోతుంది. ఇతర వృత్తి చేసుకోలేక ఈ వృత్తితో నెట్టుకొస్తున్నాం. రోజు కూలి గిట్టుబాటు అయితే చాలు అన్న చందంగా టైలర్ల పరిస్థితి ఉంది. ప్రభుత్వం మాలాంటి టైలర్లను ఆదుకోవాలి. ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రుణాలు మంజూరుచేసి అవసరమైన పని కల్పించాలి.

– ఎ.రాజేష్, టైలర్, మారుతీనగర్, రాజాం


గిరిజన యూనివర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో పాల్గొన్న వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో బోటనీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'కల్టివేషన్ ది ఫ్యూచర్ : అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ సైన్స్ అండ్ బయోటెక్నాలజీ ఫర్ సస్టెయినబిలిటీ 2025' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు గురువారం ప్రారంభం అయింది. తొలిరోజున 'ప్లాంట్ బయోటెక్నాలజీతో సుస్థిరత' అనే అంశంపై హైదరాబాద్ ఇక్రిశాట్ మాజీ డీడీజీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రసాద్, సీడ్స్ ప్రతినిధి డాక్టర్ అరివ్యండ్‌కుమార్ వివరాలు ప్రెజెంటేషన్ చేశారు. లక్నో బీబీఏ యూనివర్సిటీ బయాలజీ ఆఫ్ ప్లాంట్స్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రొఫెసర్ రాణా ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్లాంట్ అండ్ యానిమల్ జీనోమ్ స్టడీస్ ఆవశ్యకతపై విద్యార్థి దశ నుంచి అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు మాట్లాడుతూ వృక్షశాస్త్రం, జంతుశాస్త్రాలలో రాబోయే మార్పులను గమనిస్తూ పరిశోధనలు ఉండాలని సూచించారు. ఆయా పరిశోధనల ఫలితాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. డాక్టర్ అనిరుధ్‌కుమార్ సెమినార్ కన్వీనర్‌గా వ్యవహరించగా రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్, డీన్ ముక్కామల శరశ్చంద్రబాబు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు వివిధ అంశాలపై తమ పరిశోధనలను పంచుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రదానం



మృతుడు కొల్లి రమణ

మక్కువ : మండల కేంద్రంలోని యాదవ వీధికి చెందిన కొల్లి రమణ(61) ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ గురువారం విశాఖలోని కేజీహెచ్‌లో మృతి చెందాడు. ఈ విషయం కేజీహెచ్ వైద్య సిబ్బంది విశాఖపట్నంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు కేజీహెచ్‌కు చేరుకొని కుటుంబ సభ్యులకు నేత్ర దానంప అవగాహన కల్పించారు. దీంతో రమణ కుటుంబ సభ్యులు నేత్ర దానానికి అంగీకారం తెలిపారు. దీంతో కళ్లను దానం చేశారు. మృతుడు రమణకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

నేటి నుంచి బిజినెస్ ఐడియా అవగాహన సదస్సు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'జనరేట్ యువర్ బిజినెస్ ఐడియా (జీవైబీ)' పేరుతో ఐదు రోజుల పాటు అవగాహన సదస్సును శుక్రవారం గంటస్తంభం ప్రాంతంలోని మెప్మా కార్యాలయంలో ప్రారంభిస్తామని ఆ సంస్థ జిల్లా మేనేజర్ జి.ప్రశాంత్‌కుమార్ గురువారం తెలిపారు. వచ్చే నెల మార్చి 5వ తేదీ వరకు నిర్వహించే సదస్సులో ఒక వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, ఎలా ప్రారంభించాలి, ఎలా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న ఔత్సాహికులు 94929 27844 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

మామిడి తోటలో మృతదేహం



అప్పన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

గజపతినగరం రూరల్: మండలంలోని గుడివాడ గ్రామ మామిడి తోటలో గురువారం చుక్క అప్పన్న(65) అనే వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ లక్ష్మణరావు మృతదేహాన్ని పరిశీలించారు. మధుపాడ గ్రామానికి చెందిన చుక్క అప్పన్న వారం రోజులు క్రితం ఇంటి నుంచి కనిపించకుండా పోయినట్లు మృతుని భార్య సత్తెమ్మ పిర్యాదు చేసింది. అయితే మృతుడికి మతిస్థిమితం లేకపోవడం వల్ల తోటలో ఉండిపోవడంతో ఎవ్వరు గుర్తించలేకపోయారన్నారు. స్థానికుల సమాచారం మేరకు గుడివాడ గ్రామంలోని మామిడి తోటలో మృతదేహాన్ని పరిశీలించి బంధువులకు సమాచారం ఇచ్చామని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

చేపలు పట్టేశారని పోలీసులకు ఫిర్యాదు



కొర్లాం చెరువులో చేపలు పట్టిన గొల్లుపాలేంకు చెందిన వ్యక్తులు

గంట్యాడ: చేపలు దొంగతనంగా పట్టేశారని పోలీసులకు మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొర్లాం గ్రామ చప్పవాని చెరువులో బొండపల్లి మండలం గొల్లుపాలేంకు చెందిన ఏడుగురు వ్యక్తులు బుధవారం చేపలు పడుతుండగా కొర్లాం గ్రామానికి చెందిన మత్స్యకారులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గ్రామానికి చెందిన మత్స్యకారులు సింగిడి కృష్ణ, సింగిడి అప్పలరాము, సింగిడి శ్రీను, సర్పంచ్ చప్ప అబ్బయ్య, గ్రామ పెద్ద చప్ప చిన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువులో రూ.7 లక్షల వరకు మత్స్య సంపద ఉండేదని మత్స్యకారులు తెలిపారు. ప్రస్తుతం చెరువులో వల వేస్తే చేపలు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం సీసాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్సై గణేష్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై పోలీసులు గురువారం దాడులు చేపట్టారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా మద్యం అమ్మకాల నియంత్రణపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. బెల్ట్‌షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు లోకల్ పోలీసులతో కలిసి దాడులు చేపట్టారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలో బెల్ట్‌షాపులో మద్యం విక్రయస్తున్న నర్సింగరావును అదుపులోకి తీసుకుని, అతని నుంచి 83 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సైలు సతీష్, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు



పట్టుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సిబ్బంది

గజపతినగరం రూరల్: ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎం కొత్తవలస గ్రామంలో పది మద్యం సీసాలను తరలిస్తున్న బొత్స చిట్టి దాసును పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు సీఐ జనార్దనరావు గురువారం తెలిపారు.

అక్రమంగా మద్యం తరలించినా, సారా తయారు చేసినా చర్యలు తప్పవన్నారు. దాడుల్లో సిబ్బంది నరేంద్రకుమార్, భాషా, లోకాభిరామ్, పాతిమాభేగం, సౌజన్య తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

బియ్యం అక్రమ రవాణాపై నిరంతర నిఘా

● జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మధుసూదన్



బియ్యం అక్రమ రవాణాపై ఎస్‌ఐకు సూచనలిస్తున్న జిల్లా సివిల్ సప్‌లైస్ అధికారి మధుసూదన్

రామభద్రపురం: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మధుసూదన్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ సులోచనరాణితో కలిసి గురువారం ఆయన ఎస్‌ఐ వి.ప్రసాదరావుతో సమావేశమయ్యారు. మండల కేంద్రం గుండా పీడీఎస్ బియ్యం లారీలతో అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని, అలా జరగకుండా కొట్టక్కి చెక్ పోస్టుతో పాటు స్థానిక బైపాస్ రోడ్డులో నిఘా పెట్టాలని ఎస్‌ఐకు సూచించారు. పెద్ద లారీలతో పాటు వ్యాన్‌లతో రవాణా జరుగుతున్న బియ్యాన్ని పరిశీలించి విడిచిపెట్టాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ఎస్.కోట, రామభద్రపురం తదితర ప్రాంతాల బోర్డర్‌లో ఉన్న ఒడిశా రాష్ట్రానికి పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ఇంకా మరో 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు అనుమతి కోరామన్నారు. ఏడాదిగా కొత్త రేషన్ కార్డులు మంజూరు లేదన్నారు. ప్రతీ ఒక్క కార్డుదారుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. శాశ్వత వలసదారులు, మృతి చెందిన వారి కార్డుల ఏరివేతలో భాగంగా ప్రభుత్వం ఈకేవైసీ చేయిస్తుందన్నారు. గత నెలలో 5,81,668 కార్డులు ఉండగా ఈ నెలలో 5,71,774 కార్డులు ఉన్నాయన్నారు. సుమారు 10 వేల కార్డులు వరకు రద్దయ్యాయని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలకు సన్న రకం బియ్యం సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్నారు. వారి వెంట సీఎస్‌డీటీ సాయికృష్ణ ఉన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి

విజయనగరం లీగల్: మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ చేసేలా కృషి చేయాలని విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని న్యాయమూర్తులతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటారు ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు తదితరమైనవి ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, బి.అప్పలస్వామి, టీవీ రాజేష్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి, విజయనగరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ దేవీ రత్నకుమారి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రమ్య, ఎక్సైజ్ న్యాయమూర్తి ఎస్.శ్రీనివాస్, మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి పాల్గొన్నారు.

అండర్ 14 ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-14 బాల, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పూర్తయింది. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపికలకు ఉమ్మడి విజయనగరం జిల్లాల నుంచి 25 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో ఎస్.జితేంద్ర, కె.జస్వంత్, కె.జితేంద్ర, డి.ధీరజ్, సి.శ్యామ్‌కుమార్, హిమశ్రీ, బి.హసిని శ్రీవల్లి ఉన్నారు. క్రీడాకారులు మార్చి 1, 2 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లాలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డివి.చారిప్రసాద్ తెలిపారు. ఎంపిక పోటీలను పలువురు న్యాయ నిర్ణేతులు పర్యవేక్షించారు.

రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం



రైల్వేస్టేషన్ ఆవరణలో అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్‌ను ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఏడీఆర్ఎమ్ (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ అధికారులతో కలిసి రైల్వేస్టేషన్ పరిసరాలు, పరిశుభ్రతపై చర్చించారు. ప్రయాణికులతో మాట్లాడి వారి సౌకర్యాలకు, భద్రతకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు ఆదేశించారు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌తో పాటూ బుకింగ్ ఆఫీస్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, క్యాటరింగ్ స్టాల్స్ తదితర వాటితో పాటూ అమృత్‌భారత్ స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సందీప్ , రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో అపర్ణబాబా ప్రతిభ

బొబ్బిలి: పట్టణానికి చెందిన కె.అపర్ణబాబా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. విజయవాడలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగిన డబుల్స్ ఫైనల్ పోటీల్లో విశాఖపట్నం క్రీడాకారుడు మురళీవర్ధన్‌తో కలిసి విజేతగా నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. వారిద్దరూ మార్చి 16 నుంచి 21వ తేదీ వరకు గోవాలో జరిగే జాతీయ పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడనున్నారని షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంకమ చౌదరి తెలిపారు.

● ఎల్.కోటలో బర్డ్‌ఫ్లూ!



లక్కవరపుకోట మండలంలో బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తిచెందిందన్న వార్త ప్రస్తుతం కలకలం రేపుతోంది. మండలంలోని అరకు-విశాఖపట్నం రోడ్డులో జమ్మాదేవిపేట ఎత్తు బ్రిడ్జి సమీపంలోని రైస్ మిల్లులో పెంచుతున్న రెండు టర్కీ కోళ్లు గురువారం మృతి చెందాయి. బుధవారం రాత్రి వరకు బాగానే ఉన్న కోళ్లు ఉదయానికి మృతి చెందినట్టు మిల్లు యజమాని తెలిపారు. మృతి చెందిన కోళ్లను రోడ్డు పక్కనే పడేయడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ బర్డ్‌ఫ్లూతో చనిపోతే గొయ్యితీసి పూడ్చాలే తప్ప ఇలా పడేయడం వల్ల వైరస్ వ్యాప్తిచెందే అవకాశం ఉందంటున్నారు. ఇదే విషయంపై ఎల్.కోట మండలం పశుసంవర్ధక శాఖ అధికారి కోరాడ గాయత్రి మాట్లాడుతూ ఇంతవరకు బర్డ్‌ఫ్లూ వైరస్ ఎక్కడా నమోదుకాలేదన్నారు. వాతావరణ మార్పులతో ప్రస్తుతం కోళ్లు చనిపోతున్నాయన్నారు. చనిపోయిన కోళ్ల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తామన్నారు.

– లక్కవరపుకోట